# విలువలు

రాజ్యలక్ష్మి స్టాఫ్‌రూమ్‌లో అడుగు పెట్టేసరికి హెచ్.ఎమ్.గారు అర్జంటుగా రమ్మంటు న్నారని కబురొచ్చింది.

'హెచ్.ఎమ్.గారు తన్నెందుకు అంత అర్జంటుగా పిలుస్తున్నారు?' అని ఆశ్చర్యపోతూ హెచ్.ఎమ్. రూంకి వెళ్ళింది.

రాజ్యలక్ష్మి గర్ల్స్ హైస్కూల్లో సైన్స్ అసిస్టెంటుగా చేరి రెండు నెల్లే అయింది. స్టాఫ్ ఎవరితోనూ ఇంకా అంతగా పరిచయం కాలేదు. గత రెండు నెలల్లోనూ హెచ్.ఎమ్.గారితో కూడ రెండు మూడు మార్లే మాట్లాడింది.

'రండి రాజ్యలక్ష్మిగారు! కూర్చోండి. నిన్న సాయంత్రం మీ యింటికి వచ్చేను. మీరు బజారుకి వెళ్లేరని తెల్సింది. మరేం లేదు రేపు నా బర్త్‌డే కమ్ మేరేజ్ డే! ఫ్రెండ్స్ పలుగురికి చిన్న పార్టీ యిద్దామనుకుంటున్నాను. రేపు సాయంత్రం పార్టీకి మీరు తప్పకుండా రావాలి" అంటూ ఇన్విటేషన్ కార్డు అందించేరు హెచ్.ఎమ్.

"థ్యాంక్స్! తప్పకుండా వస్తాను" అంటూ ఇన్విటేషన్ కార్డు తీసుకొని బయటకు వచ్చింది రాజ్యలక్ష్మి.

"ఈవిడకు నా వయస్సు కూతురూ, కొడుకుల్లూ వున్నారని విన్నాను. యీ వయస్సులో ఇంకా బర్త్‌డేలూ మేరేజ్‌డేలూ ఏమిటి చాదస్తం" అనుకొని అదే విషయం కో టీచర్ లావణ్యగారితో అంది.

"ఆఁ! ఏం వుంది ప్రజంటేషన్స్ దండుకోడానికి" అంది లావణ్య కోపంతో

"పోనీ మనమంతా వెళ్ళడం మానేస్తేనో" అంది రాజ్యలక్ష్మి అమాయకంగా.

"ఇంకేమైనా వుందా?! చేతులారా మన ఉద్యోగాలకు మనమే రాజీనామా యిచ్చినట్లవుతుంది" అంది లావణ్య పేలవంగా నవ్వి.

రాజ్యలక్ష్మి చిన్ననాటి నుండీ కాస్త రిజర్వ్‌డ్ టైపు. అందరిలా కలుపుకోలు మనిషి కాదు. ఎంతసేపూ పుస్తకాలతో కాలక్షేపం చేసేది. ఆర్థిక ఇబ్బందుల వల్ల బి.యిడి పాసవగానే ఉద్యోగంలో చేరింది.

"ఈడొచ్చిన ఆడపిల్లవు. పై వూర్లో ఒంటరిగా ఎలా వుంటావు?" అని కన్నతల్లి తల్లడిల్లినా.

"నాకేం ఫర్వాలేద"ంటూ వచ్చి స్కూలుకు దగ్గరలో చిన్న గది అద్దెకు తీసుకొని వండుకొని తింటూ సాధ్యమైనంత పొదుపుగా గడుపుకొస్తోంది రాజ్యలక్ష్మి.

ఇంటి ఓనరు కూడ చాలామంచివారు. ఇంటావిడ సుశీలమ్మగారు రాజ్యలక్ష్మిని కన్నకూతుర్లా చూసుకుంటోంది. రెండు పూటలా ఏవో వంటకాలు రాజ్యలక్ష్మి ఎంత వారిస్తున్నా వినకుండా ఇస్తోంది.

ఆరోజు రాజ్యలక్ష్మి ఇంటికి వచ్చినప్పటి నుండీ ఒకటే ఆలోచన. 'హెచ్.ఎమ్.గారికి ప్రజంటేషన్ ఏమిటి ఇవ్వాలి' అని. కనీసం యాభై రూపాయల విలువగల వస్తువైతే కాని బావుండదు.

నెలాఖరు అవడం వల్ల రాజ్యలక్ష్మి చేతిలో నయా పైసా కూడా లేదు. చిల్లర ఖర్చుల కోసం వుంచిన పాతిక రూపాయలూ చెల్లెలు స్కూలు ఫీజు కట్టాలంటే ఆరోజే యింటికి మనియార్డరు చేసేంది. ఏం చెయ్యాలో తోచక దిగాలు పడి కూర్చుంది.

"ఏం అమ్మడూ ఇంకా వంట ప్రయత్నం చెయ్యలేనట్లుంది?" అంటూ సుశీలమ్మగారు వచ్చేరు.

కంజివరం పట్టుచీర, కాళ్ళకు పసుపు పారాణి మెడ క్రింద గంధం చేతిలో శనగల పొట్లం, ఇంటావిడ వేపు ఓ పర్యాయం చూసి

"రండి పిన్నిగారూ కూర్చోండి. ఎక్కడో పేరంటానికి వెళ్లి వస్తున్నట్లున్నారు?" అంది రాజ్యలక్ష్మి నవ్వుతూ.

"అదే ప్రక్క వీధిలో ఇంజనీరుగారు లేరూ? వాళ్ల మనవరాలిని తొట్టిలో వేసేరు"

"అయితే పేరంటానికి మీరేం తీసుకెళ్లేరు" అంది కుతూహలంగా.

"మీ బాబాయిగారు రడీమేడ్ షాపులో చిన్నగౌను కొని తెచ్చారు. పాతిక రూపాయలైంది" అన్నారు గొప్పగా.

"మనం అంతేసి ఖరీదు గల ప్రజంటేషన్లు తీసుకు వెళితే పిడికెడు శనగలు మన చేతిలో పెడతారు" అంది రాజ్యలక్ష్మి నవ్వుతూ.

"అలా మనం ఎప్పుడూ తైపారు వేసుకోకూడదమ్మాయి! ఈ పేరంటం అన్నది మన మహిళా లోకానికెంతో ఉపయోగకారి. మొగాళ్లు వీధిలో కెళ్లి ఏదో పనిమీద నలుగురితో పరిచయం కల్గించుకొని స్నేహం పెంపొందించుకుంటారు. మరి మనకా అవకాశం తక్కువ. అందువల్లే మన పూర్వీకులు స్త్రీల కోసం ఈ పేరంటం ఏర్పరిచేరు. పేరంటంలో మనం నలుగురు ఆడవాళ్లం ఒక దగ్గర కల్సుకొని క్రొత్తవారితో పరిచయం ఏర్పరుచుకోవడం, అదివరకే పరిచయం వున్నవారితో స్నేహం పెంపొందించుకోవటం,

సరదాగా కాస్సేపు కాలక్షేపం చెయ్యడానికి ఎంతో అనుకూలంగా వుంటుంది. ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి కాని ఇచ్చి పుచ్చుకోవడంలో ఏం వుంది" అంటూ చిన్న ఉపన్యాస మిచ్చేరు.

ఆవిడ మాటల్లో గల విజ్ఞతకు ఎంతో ఆశ్చర్యపోయింది రాజ్యలక్ష్మి.

"మీ బాబాయిగారు ఏదో పని మీద బజారు కెళ్లాలన్నారు. మళ్లీ వస్తాను" అంటూ వెళ్లిపోయారు.

రాజ్యలక్ష్మి తను మొదటి నెల జీతం అందుకొని ఉగాది పండుగకు కొని దాచుకున్న వాయిల్ చీర రంగు కాగితంలో నీటుగా పేక్ చేసి హెచ్.ఎమ్‌గారికి ప్రజంట్ చేసింది.

మర్నాడు సుశీలమ్మగారు పాతబట్టలకు స్టీలు సామాన్లు ఇచ్చే ఆమెతో ఏదో బేరం చేస్తుంటే చూడ్డానికి వెళ్లింది రాజ్యలక్ష్మి.

స్టీలు సామన్ల గంపలో తను ముందు రోజు హెచ్.ఎమ్.గార్కి ప్రజంటేషన్ ఇచ్చిన వాయిల్ చీర చూసి ఆశ్చర్యపోయింది. వెంటనే వుండ బట్టలేక అడిగింది.

"అవునమ్మగోరూ! ఏటా కొత్త సీరలేసి స్టీలు సామాన్లు కొంతారు. ఆ మేస్టరమ్మగోరు. ఈ పొద్దు మూడు కొత్త సీరలేసి స్టీలు కేరియర్ తీసుకొన్నారు. అంతా పాత బట్ట లేస్తారు కాని ఆ మేస్టరమ్మగోరు కొత్తబట్టలేసి కొంటారు" అన్న మాటలకు నిర్ఘాంతపోయింది రాజ్యలక్ష్మి.

*'ఆంధ్రజ్యోతి' వీక్లీ, 22-6-1979*